# కృతఘ్నుడు

కుమారి రేమణి స్వరాజ్యలక్ష్మి

"పోనీరా తమ్ముడూ! అది మరీ అంత యిదవుతుంటే, దాన్ని వదలి వెళ్ళగూడదూ! నాలుగు రోజులు పోయింతరువాత మన రాముడితో పంపిస్తాగా" అంది శాంతమ్మగారు తమ్ముడిని చూచి.

"అలా వీల్లేదక్కాయి! వుంచడానికి వీల్లేదంటుంటే వినవేం" అన్నాడు రాధాకృష్ణ కోపంతో.

"అయ్యో నాయనా! ఈమాత్రంవానికి విసుగెందుకురా! ఏమిటో చంటి సన్నాసికదా, యింకా నలుగురినీ విడిచి యెప్పుడూ వుండలేదు పోనీ బెరుకు తీరినతరువాత వస్తుందని అన్నా నంతే. అంత వుంచడానికి వీల్లేకపోతే తీసుకెడుదువుగాన్లే! అయినా నాపిచ్చిగానీ మీచేతుల్లో పెట్టిన తరువాత పిల్ల మీదిగాక నా దవుతుందా. ఎంత తమ్ముడయినా అప్పయినా" అంటూ నిష్ఠూరంగా తమ్ముడితో అని, కూతుర్ని చూచి "పోనీలేవే అమ్మడూ! వాడంత పటు పడుతున్నప్పుడు వాడితో వెళ్ళడమే మంచిది. మళ్ళీ పది పదిహేను రోజుల్లో అన్నయ్యే వచ్చి చూస్తాడులే తల్లీ! దిగులుపడకు" అంటూ గుడ్ల నీరు కక్కుకుంటూ గుమ్మా న్నానుకుని నుంచున్న అమ్మడుని అక్కున చేర్చుకుంది.

తన పంతం నెగ్గించన్న సంతోషంతో రాధాకృష్ణ పెట్టీ బెడ్డింగూ పట్టుకుని బండీవైపు నడిచాడు.

తల్లి వెళ్ళమని సంజ్ఞచేయగా యిక విధిలేదన్నట్టు అమ్మడు పంజరంలోకి పోయే పిట్టలాగా భర్తననుసరించింది. అప్పటికే బండీలో కూర్చున్న రాధాకృష్ణ పిల్లిలాగా వస్తున్న భార్యనుచూచి "తొంధరగా! అవతల బండి టైం అయిపోతూంటే" అంటూ హుంకరించాడు అతని హుంకరింపులకు అదిరిపోయిన అమ్మడు గుడ్ల నీరు కక్కుకుంటూ తల్లి కేసిచూచింది. కను కొలకుల్లోకి వస్తున్న కన్నీటిని బలవంతముగా ఆపుకుంటూ రెండు పెదిమలు బిగపట్టటంచేత మాటరాకుండా వున్న శాంతమ్మగారు "తప్పు" అన్నట్టు ముక్కుమీద వేలు పెట్టుకుంది. మారుమాటాడకుండా అమ్మడు బండెక్కింది. "వెళ్ళివస్తానమ్మా" అమ్మడు బరువుగా అన్నమాటలు బండిరొదలో కలిసిపోయాయి.

బండి సాగింది పది గజాలు, ఇరవై గజాలు, చివరకు సందు మలుపు తిరిగిపోయింది. నిశ్చేష్టురాలై నిలబడిపోయిన శాంతమ్మగారికి యిరవై అయిదు సంవత్సరాల క్రిందట తన్ను అత్తారింటికి పంపేటప్పుడు తన తల్లి పడ్డ అవస్త బోధపడింది. అప్పుడు తనకుకూడా అమ్మడి లాగే పట్టరానంత దుఃఖం వచ్చింది. అయితే బండి బయలుదేరగానే భర్త చెప్పిన అనునయ వాక్యాలవల్ల కొంత వుపశాంతి కలిగింది. అప్పటినుంచి యెప్పుడైనా ఏమైనా కాస్త ఘర్షణ తప్పితే తనూ తన భర్త ఏవిషయంలోనూ పోట్లాడుకుని యెరుగరు. సరే తను కాపరానికి రాగానే అకస్మాత్తుగా జబ్బుచేసి తన తల్లిపోయింది. అదే విచారంతో ఆర్నెల్లయినా తిరక్కుండా తండ్రి పోయాడు. అప్పటికి ఏడాదికూడా సరిగ్గా నిండని యీ తమ్ముని భారమంతా మీదవేసుకుని తల్లిలేని కొరతలేకుండా పెంచింది. తన గారాబంవల్ల రాధాకృష్ణ బొత్తిగా పెంకివాడుగా తయారయ్యాడు. కాస్త పెద్దయితే అదే పోతుందిలే అని సర్దుకుపోయింది. పెద్దవాడయినప్పటికీ పెంకితనం ఎక్కువయిందిగాని ఎంతమాత్రం తగ్గలేదు. అప్పటికీ వాడిమీదవుండే పెంచిన మమకారంకొద్దీ ఒక్కగా ఒక్కకూతురయిన అమ్మణ్ణి— అతిగారాబంగా పెంచుతున్న అమ్మణ్ణి— వాడిచేతుల్లో పెట్టింది. ఆఖరికి ఆయనబ్రతికుండగా వాడికిమాత్రం "నాబంగారాన్నివ్వను" అంటూండే మాటలుకూడా లెక్కచెయ్యలేదు. సరే! వివాహం చేసింది. దేశంకాని దేశంలో—భాష తెలియని బస్తీలో వుద్యోగం సంపాదించాడు. తనకు శలవులేదని తన భార్యనుకూడా తనతో అప్పుడే పంపెయ్యమని పట్టు పట్టి కూర్చున్నాడు. తను చెప్పి చూచింది. కొడుకుచేత చెప్పించింది. కానిరాతి హృదయం కరగలా. "వీల్లేదంటే వీల్లే" దన్నాడు. పోనీ ఆయనమాటైనా విని అమ్మడికి పరాయి సంబంధం చేసినా బాగుండేది. ఏదో తమ్ముడు, తను చిన్నప్పటినుంచి పెంచి పెద్దచేసింది. తన కూతుర్ని కూడా అతగాడికే యిస్తే, తన పిల్ల తన యింట్లోనే వుంటుందని పిచ్చి అభిప్రాయం పడింది. కాని ఈ తమ్ముడు యింత కొరకరాని కొయ్యవుతాడని పాపం ఆ పిచ్చి యిల్లాలు ఊహించలా. ఒక్కసారి వెనక్కు తిరిగి యింటిని చూచింది. అంతా ఎక్కడ చూచినా బావురు మన్నట్టుంది. అది చూడగానే శాంతమ్మగారికి దుఃఖం ఆగలేదు. ఒక్కసారిగా బావురుమంది. కాస్సేప

టికి తన్ను తనే పూరడించుకుని సావిట్లో వున్న వెంకటేశ్వరస్వామి ఫోటో దగ్గర నిలబడి భక్తి పురస్సరంగా చేతులుజోడించి "ఓ ఏడుకొండలవాడా! వెంకటరమణా! ఎక్కడున్నా ఆ పసికందు లిద్దర్నీ కాపాడే భారం నీదే" అని నమస్కారం పెట్టింది.

• • •

కాలగర్భంలో నాలుగు మాసాలు గడిచిపోయాయి. ఈ నాలుగు నెలలకి అమ్మడి దగ్గరనుంచి ఒక్కవుత్తరం మాత్రం—అదికూడా తాము కులాసాగా చేరినట్లువ్రాసింది. అంతే. మళ్ళీ వుత్తరాలు లేవు. ఆ తల్లిప్రాణం తల్లడిల్లిపోయింది. వుండబట్టలేక కొడుకుతో "పోనీరా రాముడూ మావయ్యా వుత్తరం రాయకపోయినా ఒకసారి వెళ్ళి చెల్లాయిని చూచిరా" అంది. తల్లిబాధ గ్రహించిన రాముడు అతి జాలిగా "ఇప్పుడెట్లాగమ్మా! కాలేజీకి శలవులు యివ్వగానే నువ్వూ నేనూ యిద్దరం కలిసి వెడదాము" అన్నాడు.

ఇంకో రెండు మాసాలు గడిచిపోయాయి. అకస్మాత్తుగా ఒకరోజు ఎర్ర సైకిలు యింటిముందు ఆగింది. ఆసైకిలు చూడగానే శాంతమ్మగారికి దడ బయలుదేరింది. రాముడు వణికే చేతులతో కవరు చించాడు. "అమ్మడు—సీరియస్- స్టార్ట్ ఇమిడియెట్లీ— రాధాకృష్ణ" అతి దీనంగా తల్లినిచూచి రాముడు "అమ్మా! ఈపూట బండికే బయలుదేరుదాం. అమ్మడుకేదో సుస్తీగా వుందిట." అన్నాడు. మరోగంటకల్లా యిద్దరూ రైల్లో పడ్డారు.

• • •

మంచంమీద శల్యావశిష్టంగా పడివున్న అమ్మడ్ని చూడగానే శాంతమ్మగారు తన కళ్ళని తానే నమ్మలేకపోయింది. వచ్చే ప్రాణం, పోయేప్రాణం. ఆదశలో వున్న కూతుర్ని చూచి బావురుమంటూ ఒక అంగలో మంచంమీద వాలిపోయింది. అంతవరకూ మంచానికి కొంచెం దూరంతో తల పట్టుకు కూర్చున్న రాధాకృష్ణ వీళ్ళను చూచి గదిలోకి పోయాడు. తల్లినీ, సోదరుణ్ణీ చూడగానే ఆ ఆరిపోయే జ్యోతిలో కాంతి వచ్చింది. పాలిపోయిన ఆ పెదిమల్లోంచి జీవంలేని నవ్వు బయట పడ్డది. అతి ఆయాసంతో తల్లినిచూచి "అమ్మా! నా కోసం విచారించవద్దు. ఈమాత్రం అయినా మిమ్మల్ని చూడగలిగినందుకు సంతోషించు నేను నీతో ఎక్కువ మాట్లాడలేను. నా పెట్టి తెరిచి చూడు. అందులో ఒక వుత్తరం వుంది. అది చదువుకో. అన్ని సంగతులు నీకే తెలుస్తాయి. ఇక మాట్లాడలేను అమ్మా!" అంటూ కళ్ళు మూసింది అమ్మడు. అంతే. అనంతాకాశంలోంచి ఒక నక్షత్రం రాలిపోయింది—

కర్మకాండయావత్తూ పూర్తయిన తరువాత శాంతమ్మగారు పెట్టె తెరిచి ఉత్తరం తీసి చదివింది.

నా ప్రియమైన అమ్మా!

నువ్వు ఈ వుత్తరం చదివేటప్పటికి నా భౌతికశరీరం యీ ప్రపంచంలో వుండదు. అయినా నా మనస్సులో వున్న బాధనంతనీ యీ వుత్తరం రూపంలో పొందుపరుస్తున్నాను. జాగ్రత్తగా చదువుకో—

ఆరోజు నిన్ను వదలి వచ్చిన తరువాత యిక్కడికి చేరాము. మామయ్య ఒక్కమాట కూడా ప్రేమతో మాట్లాడి ఎరుగడు. అలవాటు ప్రకారం "మామయ్యా" అంటే మండిపడేవాడు. ఎంతో ప్రయత్నంమీద అలవాటు మానుకున్నాను. నీకు వుత్తరం వ్రాయడానికి వీలు లేదన్నాడు. నీదగ్గరనుంచి వచ్చే ఉత్తరాలు నాకు చూపించేవాడు కాదు. వీటన్నిటికీ ఎలాగో సహించినా నిన్ను నాన్నని అనవసరమైన మాటలు అంటుంటే పూరుకోలేకపోయేదాన్ని. నువ్వు యితరులకు కట్నం యివ్వవలసి వస్తుందని నన్ను తనకిచ్చి కట్టినట్టు లేకపోతే ఏనాలుగు అయిదు వేలో కట్నం పెట్టి యితరులు తనకు పిల్లనిచ్చి వుండేవారనీ- యిట్లాగే యింకా ఎన్నో అనేవాడు. వుక్రోషంవచ్చి ఏమయినా సమాధానం చెప్పానా- యిక వీపు చిట్లిపోయిందన్నమాట- ఈవరసని యీ ఆరు నెలలనుంచి నేపడ్డ బాధలు ఆ భగవంతుడికే తెలియాలి.

అమ్మా! నా యాతనలకు నిన్నుగాని, మావయ్యను గానీ ఏమీ అనదలుచుకోలేదు. అయినా ఒకమాట మాత్రం వ్రాయదలుచుకున్నాను. నాకు జబ్బుచేసింతరువాత ఆయన నాకు మందిప్పించటానికి ఎందుకు ప్రయత్నించలేదో నాకర్థం కావటంలేదు— చూడగా వాటి చాటున స్వార్థం ఏదో వుందని మాత్రం అనుమానం తగులుతుంది. ఆఖరిమాట. అమ్మా! యీవిధంగా తల్లి దండ్రుల అవివేకాలవల్ల వారి మనస్సుల్లోవున్న తియ్యని కోరికలు తీరకుండా నావంటి జీవరాసులు రోజుకి ఎన్ని ఈ అనంత విశ్వంలో కలసిపోతున్నాయో. అందులో నేనొక పరమాణువును. ఇక కలం వణుకుతోంది. వ్రాయలేను. ఇవే నా తుది నమస్కారాలు.

శలవు,
అమ్మడు.

వుత్తరం చదివి "హారి కృతఘ్నుడా!" అంటూ కొయ్యబారిపోయింది శాంతమ్మగారు. ★